క్లుప్తంగా

శివలింగమూర్తికి డాక్టరేట్ ప్రదానం



ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట గ్రామానికి చెందిన ఉప్పర పెద్ద తులసిమూర్తి, లక్ష్మీదేవీల కుమారుడు ఎం. శివలింగమూర్తి డాక్టరేట్ అందుకున్నాడు. విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం లా కాలేజీ విభాగంలో ప్రొఫెసర్ ఎస్. సుమిత్ర పర్యవేక్షణలో 'భారతదేశంలో ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థ యొక్క సమర్థత, అభివృద్ధి ప్రజల యొక్క ఆరోగ్య హక్కు' అనే అంశంపై పరిశోధన చేసినందుకు యూనివర్సిటీ శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేసింది. శివలింగమూర్తిని పలువురు అభినందించారు.

ఒకేషనల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్



విద్యార్థినులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయిని

ఆదోని రూరల్: ఒకేషనల్ కోర్సులో భాగంగా ఐటీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా పది రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు పెద్దహరివాణం పాఠశాల హెచ్ఎం ఇందిరాదేవి, వృత్తి విద్య ఉపాధ్యాయుడు ఎం.నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం విద్యార్థులకు డిజిటల్ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది, మీసేవా, జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు ఇంటర్న్‌షిప్‌నకు సహకరిస్తున్నారని చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం, నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఐ

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ధర్మపురం టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ టౌన్‌కి చెందిన ఈడిగ వెంకటేష్, బాలు కర్ణాటక మద్యాన్ని కారులో తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. 960 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. మరో నిందితుడి బాలు పారిపోయాడని, త్వరలో అరెస్టు చేస్తామన్నారు. కారును స్వీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

గోనెగండ్ల: మండల కేంద్రంలోని మొట్టివీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ హైమవతి, పంచాయతీ సిబ్బందితో కలిసి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గోనెగండ్లలోని మొట్టివీధిలో ఉపాధిహామీ పథకం నిధులు రూ.10 లక్షలతో సీసీరోడ్డు, డ్రైనేజీ కాలువలు నిర్మించనున్నట్లు తెలిపారు. గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

పిడుగుపాటుకు మేకలు మృతి



చనిపోయిన మేకలు

మంత్రాలయం: కౌతాళం మండలం బదినేహాల్‌లో పిడుగుపాటుకు గురై మేకలు మృత్యువాత పడ్డాయి. వివరాలివి.. కౌతాళం మండలం బదినేహాల్ గ్రామానికి చెందిన బడేసాబ్ భార్య అమీనాబి 30 మేకల మందను మేపేందుకు తీసుకెళ్లింది. మధ్యాహ్నా సమయంలో ఉరుములు, మెరుపులతో వాన కురవగా మేకలు అక్కడున్న చెట్టు కిందకు చేరుకున్నాయి. ఆ సమయంలో భారీ శబ్ధంతో మందపై పిడుగు పడటంతో 5 మేకలు మృతిచెందాయి. అమీనాబి కాస్త దూరంగా ఉండటంతో ప్రాణాలతో బయటపడింది. మేకలమృతితో రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని బాధితురాలు వాపోయింది.

జాబ్ మేళాలో 204 మందికి ఉద్యోగాలు

ఎమ్మిగనూరుటౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 204 మందికి ఉద్యోగాలు లభించాయి. 17 కంపెనీల ప్రతినిధులు 402 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా వారిలో 204 మందికి ఉద్యోగాలు లభించాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయితేజా తెలిపారు.

రైతు కష్టం వర్షార్పణం

- వర్షానికి ఆదోని మార్కెట్ యార్డులో తడిచిన వేరుశనగ
- కాలువలో కొట్టుకుపోయిన 150 సంచుల దిగుబడి
- రైతులు, రైతు సంఘం నాయకుల ఆందోళన
- కమీషన్ ఏజెంట్‌తో పరిహారం ఇప్పించిన యార్డు సెక్రటరీ



కవర్లతో కప్పిఉంచిన పంట దిగుబడుల కిందకు చేరిన వర్షపునీరు

ఎమ్మిగనూరు: ఆరుగాలం కష్టించి పండించిన రైతన్నకు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. అటు ప్రభుత్వ పరంగా రైతు భరోసాగాని, రైతు బీమాగాని అందకపోగా పంట రుణాలు ఇచ్చే నాథుడే కరువయ్యాడు. చివరకు రైతులు పండించిన పంటలను అమ్ముకుందామన్నా గిట్టుబాటు ధరలు ఉండడం లేదు. మార్కెట్‌కు తెచ్చిన పంట దిగుబడులకు రక్షణ లేదు. శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో పంట దిగుబడులు తడిసి ముద్దయ్యాయి. వర్ష సూచన తెలుసుకున్న కొందరు రైతులు తమ సరుకును రేకుల షెడ్ల కిందకు మార్చుకున్నారు. మరికొందరు మార్చుకునే అవకాశం లేకపోవడంతో టార్పాలిన్లు కప్పి పంట దిగుబడులను రక్షించుకునే ప్రయత్నం చేశారు. అయినా వర్షం నీరు పంట ఉత్పత్తుల కిందకు చేరి బురదమయమయ్యాయి. శుక్రవారం ఎమ్మిగనూరు మార్కెట్‌కు 2884 క్వింటాళ్లు వేరుశనగ, 214 క్వింటాల ఆముదాలను రైతులు విక్రయించాలని తెచ్చారు. ముమ్ముందు అయినా మార్కెట్ యార్డుకు తరలించే పంట ఉత్పత్తులను వర్షపు నీటిలో తడవకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వేరుశనగ.. వర్షార్పణం

ఆదోని అర్బన్: పట్టణంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు అమ్మకానికి తెచ్చిన వేరుశనగకాయలు కాలువలో కొట్టుకుపోయాయి. కొందరు రైతులు టార్పాలిన్లు కప్పడం, మరికొంతమంది గోడౌన్‌లో వేసుకోవడంతో వారు బయటపడ్డారు. తుగ్గలి మండలం ఎద్దులదొడ్డి గ్రామానికి చెందిన రంగన్న 92 సంచులు, నాగరాజునాయక్ 42 సంచుల వేరుశనగ కాయలు విక్రయానికి ఆదోని మార్కెట్ యార్డుకు తెచ్చారు. అయితే కురిసిన భారీ వర్షానికి నీటిలో తడిచి కాలువలో కొట్టుకుపోయాయి. లబోదిబోమంటున్న ఇద్దరు రైతులు రైతు సంఘాలను ఆశ్రయించారు. వెంటనే రైతు సంఘం నాయకులు వెంకటేష్, రైతులు యార్డు సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే కమీషన్ ఏజెంట్‌ను పిలిపించి 150 సంచులకు వచ్చే మొత్తాన్ని రైతులకు ఇప్పించారు.

ఆదోనిలో మోస్తరు వర్షం

ఆదోని టౌన్: పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు జోరువాన కురిసింది. దీంతో రోడ్లపై వర్షపునీరు ప్రవహించింది. మురుగు కాలువలు పొర్లడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మున్సిపల్ మెయిన్ రోడ్డులో వరదనీరు మోకాళ్లోతు వరకు ప్రవహించాయి. పాత బస్టాండు సర్కిల్‌లో 3 అడుగులకు పైగానే నీరు ప్రవహించింది. నిర్మల్ టాకీస్ రోడ్డులో నీరు రోడ్డుపైనే నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భీమాస్ సర్కిల్, పాత బస్టాండు సర్కిల్, ఎన్టీఆర్ విగ్రహం ఏరియాలో ప్రధాన రోడ్డుపై వరదనీరు రెండు అడుగుల మేర ప్రవహించాయి. ఎక్కువగా వర్షాలు కురవడం వల్ల పత్తి, మిరప, సజ్జ, కొర్రలు, టమాట, ఆకు కూరలు, కూరగాయల పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రబీ సీజన్ ప్రారంభంలోనే అదునైన వర్షం కురవడంతో పంటలు సాగు చేసే అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.



ఆదోనిలో కొట్టుకుపోతున్న వేరుశనగ కాయలు



భీమాస్ సర్కిల్‌లో ప్రవహిస్తున్న వర్షపు నీరు



కంచిగారి వీధి అంగన్‌వాడీ సెంటర్‌లో వర్షపు నీటిని బయటకు ఎత్తి పోస్తున్న బాలమ్మ

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ



మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాత

ఎమ్మిగనూరురూరల్: పత్తి, వరి, వేరుశనగ పంటల్లో తెగుళ్ల నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాత అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ భవనంలో రైతు సేవా కేంద్రాల సహాయకులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున పంటలకు తెగుళ్లు సోకుతున్నాయని చెప్పారు. వాటి నివారణకు సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. రైతు సేవా కేంద్రాల సహాయకులు రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు. రైతులు తెగుళ్ల నివారణకు మితిమీరి రసాయన ఎరువులు ఉపయోగించకుండా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. పంటల నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని, నమోదు చేయించుకుంటే ప్రభుత్వం నుంచి సబ్సిడీ పథకాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, మంత్రాలయం ఏఓ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

ఎంపీడీఓగా మణి మంజరి బాధ్యతలు



గోనెగండ్ల: స్థానిక ఎంపీడీఓగా ఎం. మణి మంజరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గోనెగండ్ల ఎంపీడీఓగా పనిచేస్తున్న ఎంజీ ప్రవీణ్ కుమార్ పాణ్యంకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మంత్రాలయంలో పనిచేస్తున్న మణి మంజారి బదిలీపై గోనెగండ్లకు వచ్చారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటానని నూతన ఎంపీడీఓ తెలిపారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అలాగే గోనెగండ్ల ఈఓఆర్డీగా అనంతసేనా శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న నాగేష్ కల్లూరుకు బదిలీపై వెళ్లారు.

మంత్రాలయం ఎంపీడీఓగా శోభరాణి



మంత్రాలయం: మంత్రాలయం ఎంపీడీఓగా శోభరాణి శుక్రవారం సాయంత్రం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమె నందికొట్కూరు నుంచి మంత్రాలయంకు బదిలీపై వచ్చారు. మంత్రాలయంలో పనిచేస్తున్న ఎంపీడీఓ మణిమంజరి గోనెగండ్లకు బదిలీ అయ్యారు. అలాగే మంత్రాలయం ఏఓగా పనిచేస్తున్న అమరేంద్రుడు నందికొట్కూరుకు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఆస్పరి నుంచి రాధమ్మను మంత్రాలయం ఏఓగా నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ, ఏఓలు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

నందవరం: మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ లక్ష్మీదేవమ్మ కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ పుల్లయ్య, ఈఓపీఆర్డీ సందీప్, పీఆర్ ఏఈ నరసింహులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, పంచాయతీ రాజ్ ఏఈలు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీపీ లక్ష్మీదేవమ్మను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. అధికారులు మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధికి తమ కృషి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



కర్ణాటక మద్యం, నిందితుడిని చూపుతున్న ఎస్ఐ మహేష్‌కుమార్

ఆదోని రూరల్: పెద్దతుంబళం గ్రామ సమీపంలోని ఎల్ఎల్‌సీ కెనాల్ వద్ద కోసిగి గ్రామానికి చెందిన బోయ వీరేష్ కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డాడని ఎస్ఐ మహేష్‌కుమార్ గురువారం తెలిపా రు. వీరేష్ నుంచి 90 ఎం.ఎల్. పరిమాణం గల 960 టెట్రా ప్యాకెట్లు, మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న మంజుల

ఎమ్మిగనూరుటౌన్: జీపీఎస్, సీపీఎస్‌కు తాము వ్యతిరేకమని, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల పేర్కొన్నారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ ఉన్నత పాఠశాలలో ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఏర్పాటు చేయాలని, అంతవరకు ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. విద్యారంగం వినాశనానికి కారణమైన 117 జీఓను వెంటనే రద్దు చేయాలన్నారు. విద్యాప్రమాణాల పెంపునకు బోధనేతర పనులను తగ్గించాలని కోరారు. యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడం పద్ధతి కాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిపడ్డ మొత్తాన్ని చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి, మాజీ రాష్ట్ర కార్యదర్శి పాండురంగ ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, నాయకులు పాతిరెడ్డి, సురేష్‌కుమార్, వీరన్నపాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పెద్దకడబూరు: ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో ఆదోని మధు హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ శిబిరంలో గుండె వ్యాధి నిపుణులు, కీళ్లనొప్పి నిపుణులు వైద్య సేవలందిస్తారన్నారు. మండలంలోని ప్రజలు శిబిరానికి హాజరై ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చని వివరించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఆదోని టౌన్: పట్టణంలో జరుగుతున్న పూడికతీత, చెత్త తొలగింపు పనులను మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, శానిటేషన్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. పాత బస్టాండు సర్కిల్‌లో మురుగు కాలువల్లో పూడికతీత ఎత్తివేత, తరలింపు పనులు చేపట్టారు. 29వ వార్డులోని బుద్దేకల్, శక్తిగుడి ఏరియాల్లోనూ కమిషనర్ అధికారులతో కలిసి శానిటేషన్ పనులను పరిశీలించారు. విక్టోరియా, వైఎంకే నగర్, టీజీఎల్ కాలనీ,భీరప్ప కాలనీలోని మున్సిపల్ పార్కులో పెరుగుతున్న మొక్కలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకోవాలి

ఆదోని సెంట్రల్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులు వేస్తున్న కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆ ఆలోచనను విరమించుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఏచూరి సేవలు మరువలేనివి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోని రూరల్: ప్రజా ఉద్యమాల నేత, సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాధాకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మార్క్సిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై నాటి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ దేశ రాజకీయాల్లో తన ప్రత్యేకతను చాటారని కొనియాడారు. తుదిశ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేశాడన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న, రామాంజనేయులు, ఉచ్చీరప్ప, వీరేష్, వెంకటేశులు పాల్గొన్నారు.

నేడు జనరల్‌బాడీ సమావేశం

పెద్దకడబూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ శ్రీవిద్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జనార్ధన్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరై వారి గ్రామాలలో నెలకొన్న సమస్యలను తెలియజేయాలన్నారు. గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలు ఎంతవరకు పూర్తయ్యాయో చర్చించుకొని మండల అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు అందించాలని ఎంపీడీఓ కోరారు.

హోటళ్ల యజమానులు శుభ్రత పాటించాలి

పెద్దకడబూరు: బస్టాండ్ ఆవరణలోని హోటళ్ల యజమానులు పంచాయతీకి సహకరించాలని లేకపోతే చర్యలు తప్పవని సర్పంచ్ రామాంజనేయులు హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే రహదారిలో హోటల్ వారు పారబోసిన చెత్తచెదారాన్ని పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హోటళ్ల యాజమానులు వ్యర్థాలను రోడ్డుకు ఇరువైపులా ఇష్టం వచ్చినట్లు పారబోస్తున్నారన్నారు. ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా హోటల్ యాజమానులలో చలనం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా వారిలో మార్పు రాకపోతే పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతిఒక్క హోటల్ యాజమాని సామాజిక బాధ్యతతో గ్రామ పంచాయతీకి సహకరించాలని సూచించారు.

కొనసాగుతున్న గోవిందమ్మ దీక్ష

ఎమ్మిగనూరుటౌన్: తనపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని కోరుతూ గోవిందమ్మ చేస్తున్న దీక్ష శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. నిందితులందరినీ అరెస్టు చేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో నిరాహార దీక్షకు పూనుకుంది.

బ్రహ్మచారిణి అలంకరణలో దొండు మారెమ్మ



సోమలగూడూరులో ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మతల్లి



బ్రహ్మచారిణి అలంకరణలో దొండు మారెమ్మవ్వ



కందుకూరులో బ్రహ్మచారిణి దేవి అలంకరణలో శాంభవి దేవి

ఆదోని రూరల్: మండలంలోని నెట్టేకల్ గ్రామానికి వెళ్లే రోడ్డులో వెలిసిన దొండు మారెమ్మవ్వ ఆలయంలో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు బ్రహ్మచారిణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దొండు మారెమ్మవ్వ ఆలయ వంశస్థులు సున్నంబట్టి లక్ష్మన్న, వారి కుటుంబ సభ్యులు, భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

బ్రహ్మచారిణి నమోస్తుతే

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు బ్రహ్మచారిణి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో వేకువజాము నుంచి అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు చేపట్టారు. అనంతరం అలంకరణ చేసి ఫలపుష్పాలు సమర్పించి మహామంగళ హారతులు గావించి పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తీర్థ ప్రసాదాల పంపిణీ జరిగింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దేవి పురాణం చదివి భక్తులకు వినిపించారు.

గాయత్రి దేవి.. నమోస్తుతే

నందవరం: గురజాల రామలింగేశ్వరస్వామి ఆలయంలో వెలసిన పార్వతీదేవి గాయత్రీమాతగా, సోమలగూడూరులోని పెద్దమ్మ బాలా త్రిపురసుందరి దేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ధనలక్ష్మిగా జమ్ములమ్మ దర్శనం



కన్యకాపరమేశ్వరి



జమ్ములమ్మదేవి ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించిన దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం పట్టణంలోని జమ్ములమ్మదేవి ఆలయంలో రూ.11.50 లక్షల కరెన్సీ నోట్ల రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆయన ధర్మకర్త తట్టెబుడ్డప్ప ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అదేవిధంగా కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రీదేవి రూపంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే పట్టణంలోని వేదగాయత్రీ దేవి, తేరు బజారులో ఏర్పాటు చేసిన అమ్మవారికి పూజలు చేశారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతుకూలీ సంఘ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: రైతులకు కూటమి ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం రూ.20వేలను వెంటనే ఇవ్వాలని భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలొ తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.30వేలు నష్ట పరిహారం అందించాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి చిన్న, సన్నకారు రైతులకు రూ.10వేల పింఛన్‌ను మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు షఢక్, చిన్న జయన్న, హనీఫ్, చిన్ని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఆస్తి పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అధికారులతో సమీక్షించారు. ఆస్తి పన్ను లేని ఇళ్లను గుర్తించి పన్ను విధించాలని తెలిపారు. బకాయి పడ్డ యజమానులకు ఈఎస్‌డీ నోటీసులు జారీ చేయాలన్నారు. నెహ్రూనగర్‌లో డ్రైనేజీ పనులను పరిశీలించారు. ప్రభుత్వాస్పత్రి ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు.

మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ వై.గిరిజమ్మ

మంత్రాలయం: మండలంలోని అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని, అలాగే మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ గిరిజమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మనిమంజరి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గిరిజమ్మ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అర్హతనే ప్రామణికంగా చేసుకుని సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలని సూచించారు. గతంలో సభ దృష్టికి వచ్చిన సమస్యల పురోగతిపై అధికారులతో చర్చించారు. వివిధ శాఖల అధికారులు అభివృద్ధి పనులను వివరించారు. జెడ్పీటీసీ సభ్యులు మజ్జిగ గోవిందమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్‌లు తెల్లబండ్ల భీమయ్య, అంజిని, ముక్రన్న, ఎంపీటీసీలు రామాంజనేయులు, వెంకటేష్, ఈఓపీఆర్డీ ప్రభావతి, తదితరులుపాల్గొన్నారు.

దాక్యుమెంట్స్ పోయినవి

ఆదోని పట్టణ ప్రజలకు తెలియజేయడం ఏమనగా గొల్ల శ్రీనివాసులు, S/o. G.ఈరన్న వయస్సు 55 సం॥ రాలు H.No 21/10-1, ESI హాస్పిటల్ ఎదురుగా ఆదోని, వీరికి సంబంధించిన ఒరిజినల్ రిజిస్టర్ డాక్యుమెంట్ 15/09/2024 తేదీన House Shifiting చేయుచున్నపుడు పోయినవి. ఈ ఒరిజినల్ రిజిస్టర్ డాక్యుమెంట్ నెం 87/2018, Date 5/01/2018, 2715/2018, Date 29/03/2018 ప్లాట్ నెం. 8, L.P.No. 70/85 సర్వే నెం. 166/C 167/D & 167/E నెంబర్ గల డాక్యుమెంట్ పోయినవి. కావున ఈ డాక్యుమెంట్ ఎవరికైన దొరికినచో ఈ క్రింద అడ్రస్సుకు ఇవ్వగలరని ప్రార్థన.

ఇట్లు. గొల్ల శ్రీనివాసులు, ఆదోని
సెల్: 96769 33732